బుధ వారం
22-11-2023
సంపుటి - 08,
సంచిక - 394
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ ఇంట్లో ఈడీ, ఐటీ సోదాలు




**హైదరాబాద్,నవంబర్21(సమ సమాజం):** బెల్లంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ ఇంట్లో ఈడీ, ఐటీ సోదాలు జరగుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచి ఈ సోదాలు కొనసాగుతున్నాయి. ఉదయం ఆయన సోదరుడు మాజీ ఎంపీ, చెన్నూరు అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ నివాసంలో కూడా ఈడీ, ఐటీ సోదాలు నిర్వహించింది. ఏకకాలంలో సోదరులిద్దరిపై సోదాలు నిర్వహించడం కలకలం రేపుతోంది. వివేక్ నివాసంలో దాదాపు నాలుగున్నర గంటల పాటు సోదాలు జరిగాయి. ఈ నెల 13న ఫ్రీజ్ చేసిన రూ.8 కోట్ల నగదుపై ఐటీ ఆరా తీసింది. అయితే వివేక్ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఈడీ అధికారులు వెళ్లిపోయారు. ఇంట్లో ఎలాంటి డాక్యుమెంట్లు, నగదును కూడా అధికారులు సీజ్ చేయనట్లు తెలుస్తోంది. అటు మంచిర్యాలలో ఈడీ, ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. అలాగే.. షాదన్ కాలేజ్‌లో పనిచేస్తున్న ఇక్బాల్ అహ్మద్ నివాసంలోనూ ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. బంజారాహిల్స్ రోడ్ నంబర్12 లో సోదాలు కొనసాగుతున్నాయి. కొమురంభీం జిల్లాలో ఐటీ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. కాగజ్‌నగర్‌లో పలువురు వ్యాపారవేత్తల ఇళ్లల్లో ఐటీ తనిఖీలు జరుపుతోంది. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ ఇంట్లో ఐటీ సోదాలు నిర్వహిస్తోంది

## కెటీఆర్‌పై ఫిర్యాదు.. చర్యలకు సిద్ధం



**హైదరాబాద్, నవంబర్ 21 (సమ సమాజం):** మంత్రి కేటీఆర్ ప్రచార తీరుపై ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ భవనాల్లో కేటీఆర్ ఇంటర్వ్యూలు, న్యూస్ పేపర్‌లో తప్పుడు ప్రకటన ఇవ్వడంపై కాంగ్రెస్ కంప్లైంట్ చేసింది. మూడు రోజుల పాటు కేటీఆర్‌ను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ భవనం (టిహబ్)లో విద్యార్థులు, యువతతో కేటీఆర్ మీటింగ్ పెట్టి ప్రచారం చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం చేయడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని ఫిర్యాదులో కాంగ్రెస్ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రావును కాంగ్రెస్ బృందం కలిసింది. కాంగ్రెస్ కంప్లైంట్ నేపథ్యంలో కేటీఆర్‌పై చర్యలకు తీసుకునేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్

డాక్టరేట్ ప్రధానం చేసిన సీఎం స్టాలిన్



**చెన్నై, నవంబర్ 21 (సమ సమాజం):** తెలుగు సినీ పరిశ్రమలో అద్భుత గాయని గానకోకిల పీ.సుశీలకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు తమిళనాడు సీఎం ఎంకే. స్టాలీన్. డాక్టర్ జయలలిత మ్యూజిక్ అండ్ గావిన్ యూనివర్సిటీ 2వ స్నాతకోత్సవం చెన్నైలోని కలైవానర్ అరంగంలో జరుగుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ

3వ పేజీలో...

# భట్టి విక్రమార్క ఏం చేసిండని ఓట్లు అడుగుతున్నాడు

## కాంగ్రెస్ పాలనలో ఎన్ని కష్టాలు పడ్డామో మర్చిపోవద్దు

- బిఆర్ఎస్ పాలనలో రైతులు ఎంతో బాగుంది
- మళ్లీ ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి : సిఎం కెసిఆర్
- దళిత వర్గం భట్టికి ఓటు వేయొద్దు : సిఎం కెసిఆర్
- సీతారామ ప్రాజెక్టుతో వజ్రపు తునకలా ఖమ్మం జిల్లా
- ప్రాజెక్టు కింద నీళ్లు పారితే గతంలో పన్ను వసూలు
- బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక పన్నులు రద్దు చేశాం
- 3650 కుటుంబాలకు పోడు భూముల పట్టాలు పంపిణీ
- తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం
- వైరా ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్
- జగదీశ్‌రెడ్డిని గెలిపిస్తే సూర్యాపేటకు డ్రై పోర్టు
- కాంగ్రెస్ పాలనలో మూసీ ప్రాజెక్టును నాశనం చేశారు
- ఏళ్ల తరబడి మురికి నీళ్లు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ ది
- బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెన్ పహాడ్ కాలువలో ఏడాదంతా నీళ్లు
- సూర్యాపేట ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్




**మధిర, నవంబర్ 21 (సమ సమాజం):** దళిత బిడ్డలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయొద్దు.. మధిర కాంగ్రెస్ అభ్యర్థి భట్టి విక్రమార్క మనకు చేసేది ఏం లేదు అని సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఇంచు అయినా కేసీఆర్‌దే. ప్రతి ఇంచు బాగు పడాల్సిందే అని స్పష్టం చేశారు. మధిర నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని లింగాల కమల్ రాజ్‌కు మద్దతుగా ప్రసంగించారు. మధిర చైతన్యవంతమైన ప్రాంతం.. మీరంతా ఆలోచించాలి. గతంలో మధిరలో బీఆర్ఎస్ పార్టీని రెండు సార్లు గెలిపించలేదు. అయినా మీ మీద అలగలేదు. ఎందుకంటే ఈ మధిర నాది. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఇంచు అయినా కేసీఆర్‌దే. ప్రతి ఇంచు బాగు పడాల్సిందే. ఎక్కడ ధాన్యం పెరిగినా, ఎక్కడ పది మంది ముఖాలు తెల్లవడ్డ నాకు గర్వమే కదా..? రాష్ట్ర నాయకత్వానికి ఉండాల్సిన సోయి కదా..? అని కేసీఆర్ పేర్కొన్నారు. ఇక్కడ ఉన్నది కాంగ్రెస్ పార్టీ. అట్ల అని పక్షపాతం వహించలేదు. దళితబంధు ద్వారా మీరు సత్యాన్ని గమనించాలి. రాష్ట్రమంతా అమలు చేస్తున్నాం. ఒక మండలంలో అన్ని కుటుంబాలకు ఇస్తే వచ్చే ఫలితం ఎలా ఉంటది అని చెప్పి ప్రయోగత్మకంగా నాలుగు మండలాలు తీసుకున్నాం. ఇక్కడ భట్టి విక్రమార్క ఉన్నడు. ఆయన కాంగ్రెస్ అని పక్షపాతం పట్టలేదు. చింతకాని నుంచి నాకు ఎవరూ దరఖాస్తు పెట్టలేదు. భట్టి నన్ను అడగలేదు. దాని కోసం ధర్నా చేయలేదు. నన్నెవరూ డిమాండ్ చేయకున్నా నాకు నేను రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు మండలాలు తీసుకున్న. దాంట్లో చింతకాని ఒకటి. 400కు పైగా ఇండ్లు ఉంటే అందరికి ఈ కార్యక్రమం అమలు చేశాం. మధిరలో దళిత జనాభా ఎక్కువ. దళిత సమాజం, మేధావులు దళిత బిడ్డలు, అక్కాచెల్లెళ్లు ఈ విషయాన్ని దృష్టి పెట్టి ఆలోచన చేయాలి. 50 ఏండ్ల కాంగ్రెస్ పరిపాలనలో దళిత బంధు లాంటి ప్రోగ్రాం పెట్టి ఉంటే ఇంతకాలం దళితుల దరిద్రం ఇట్లనే ఉండేదా దళిత సమాజం దోపిడికి గురైన సమాజం. తరతరాలుగా అణచివేయబడ్డ సమాజం. వెలివాడలలో నివసించిన సమాజం. వాళ్లు సాటి మనషులు కారా..? వాళు పైకి రాకూడదా.. వాళ్లు మనలాగా తయారు కాకూడదా.. ఎంతకాలం దళితుల దరిద్రం ఉంటదో.. ఈ దేశం ముఖం మీద ఒక మచ్చనే ఉంటది తప్ప ఈ దేశానికి క్షేమం కాదు. అది పోవాలి అని కేసీఆర్ పేర్కొన్నారు. ఉత్తర భారతదేశంలో దళితుల మీద భయంకరమైన దాడులు. మోదీ రాష్ట్రంలో కూడా దాడులు. భయంకరమైన దాడులు మనం అసలు భరించలేం. అతి తీవ్రమైన వివక్ష. ఇది పోవాలి. తెలంగాణ దళిత బంధు భారతదేశ దళితజాతికి ఒక మార్గదర్శనం చేయాలని పెట్టుకున్నాం. ఒకటే రోజు అందరికీ ఇవ్వలేకపోయినా, కనీసం దఫదఫాలుగా అయినా సరే వారి పేదరికం పోవాలి. దళిత యువకులు, యువతుల్లో వజ్రాలు, రత్నాలు ఉన్నాయి. వాళ్లకు అవకాశం లేక ఉంటున్నారు. ఉట్టిగ పదిలక్షలు ఇచ్చి ఊరుకోవడం లేదు. దళితబంధులో మేం జేసింది ఏందంటే రిజర్వేషన్లు పెట్టినం. వైన్, బార్ షాపులు బాగా డబ్బులు సమకూర్చే వ్యాపారం. ఒక్క దళితుడికి అన్న ఉండేన ఈ రాష్ట్రంలో. రిజర్వేషన్లు పెట్టి 260 మందికి ఇచ్చాం. మెడికల్ షాపుల్లు, ఫర్టిలైజర్ షాపుల్లో రిజర్వేషన్లు పెట్టినం. ఎవ్వళు ఇవన్నీ నాకు చెప్పలేదు. ఇవన్నీ నాకంతట నాకు పెట్టుకున్న ప్రోగ్రాం. చింతకాని మండలం ఇవాళ బాగుపడ్డది. మరి దళితబిడ్డలు మళ్లా కాంగ్రెస్‌కు ఎందుకు గుద్దాలి ఓటు. ఈ పట్టి లేని భట్టి విక్రమార్కకు ఓటేస్తే మీకు వచ్చేది ఏంది..? పట్టులేనటువంటి, పట్టించుకోనటువంటి భట్టి విక్రమార్క మనకు చేసేది ఏంది..? ఆయన నియోజకవర్గానికే ఆరు నెలలకు ఒకసారి వస్తడు. చుట్టపు చూపులా వచ్చే మనిషి. అంతే కదా..? నేను వాస్తవం చెబుతున్నా అని కేసీఆర్ పేర్కొన్నారు.

## రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత

# కేసీఆర్‌దే

- అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు అమలు చేస్తాం
- పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



**వనపర్తి, నవంబర్ 21 (సమ సమాజం):** బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి.. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అప్పులపాలు చేశారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వనపర్తి జిల్లాలోని విజయభేరి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

3వ పేజీలో...

# తొమ్మిదేళ్ల పాలనలో వేలకోట్ల అప్పులు

## రాష్ట్రాన్ని కేసీఆర్ భ్రష్టు పట్టించారు

- బంగారు తెలంగాణ పేరుతో అప్పుల తెలంగాణగా మార్చారు
- రాష్టం విభజన సమయంలో ధనిక రాష్టంగా తెలంగాణ
- తెలంగాణకు రావాల్సిన డబ్బును కేంద్రం ఎప్పుడూ ఆపలేదు
- మీట్ ది గ్రీట్ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్



**హైదరాబాద్,నవంబర్21(సమ సమాజం):** కేసీఆర్ బంగారు తెలంగాణ అని చెబుతూ రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో ఆమె మంగళవారం తెలంగాణలో పర్యటించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టిన ఆమె అక్కడ ఏర్పాటు చేసిన మీట్ ది గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ లోటు బడ్జెట్‌కు తీసుకువచ్చిందన్నారు. 2014లో రాష్టం విభజన సమయంలో తెలంగాణలో ధనిక రాష్టమని, తొమ్మిదేళ్ల

3వ పేజీలో...

# నచ్చిన పేర్లను ఎంపిక చేయడమేంటి?

## కొలీజియం సిఫార్సులలో కేంద్రంపై సుప్రీం సీరియస్



**న్యూఢిల్లీ, నవంబర్ 21 (సమ సమాజం):** హైకోర్టు న్యాయమూర్తుల బదిలీల విషయంలో కొలీజియం పంపిన సిఫారసులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. తాము చేసిన సిఫార్సుల్లో కొన్ని పేర్లకే ఆమోదం చెబుతూ అభీష్టానికి తగ్గట్లు ఎంపిక విధానాన్ని కేంద్రం పాటిస్తోందని వ్యాఖ్యానించింది. న్యాయమూర్తుల ఎంపిక, బదిలీల కోసం కొలీజియం సిఫార్సులకు ఆమోదం తెలపడంలో కేంద్రం జాప్యం చేస్తోందంటూ దాఖలైన రెండు పిటిషన్లపై జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ పద్ధతిలో నియామకాలు చేపట్టడం ద్వారా న్యాయమూర్తులు సీనియార్టీని కోల్పోతారని అభిప్రాయపడింది. నచ్చిన పేర్ల ఎంపిక విధానం వద్దంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. బదిలీ కోసం 11మంది జడ్జీల పేర్లను కొలీజియం సిఫార్సు చేయగా అందులో అయిదుగురే బదిలీ అయ్యారని.. ఆరు పేర్లు ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. ఇది మంచి పరిణామం కాదని కొలీజియం సభ్యుడైన జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వ్యాఖ్యానించారు. గతంలోనూ ఈ విషయం చెప్పానంటూ అటార్నీ జనరల్ వెంకటరమణిని ఉద్దేశించి జస్టిస్ కౌల్? పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల హైకోర్టుల్లో జడ్జీల నియామకం కోసం ఇటీవలే కొలీజియం సిఫార్సు చేసిన 8 మంది పేర్లు ఇంకా పెండింగ్?లోనే ఉన్నాయనే విషయం కూడా ధర్మాసనం గుర్తుచేసింది. వారిలో కొందరు ఇప్పటికే నియమితులైనవారి కన్నా

3వ పేజీలో...

# చంద్రబాబు బెయిల్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు సీఐడీ



**విజయవాడ, నవంబర్ 21 (సమ సమాజం):** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం అధినేత చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై... ఏపీ సీఐడీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీఐడీ సుప్రీంలో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసినట్లు ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. హైకోర్టు తీర్పు న్యాయసమ్మతం, చట్టసమ్మతం కాదన్న పొన్నవోలు... చంద్రబాబుకు బెయిల్ ఇవ్వడం దురదృష్టకరమని ఆక్షేపించారు. స్కిల్ కేసులో ఆర్థిక అవకతవకలపై తగిన సాక్ష్యాధారాలు సమర్పించినా హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదన్నారు. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించామని ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ కేసులో చంద్రబాబుకు సోమవారం హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. చంద్రబాబు, టీడీపీ ఖాతాలకు నిధులను మళ్లించారనేందుకు సీఐడీ ఎలాంటి ప్రాథమిక ఆధారాలూ

3వ పేజీలో...

# అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- లెక్కింపు కేంద్రాల్లో భారీగా భద్రతా ఏర్పాట్లు
- కొనసాగుతున్న వృద్ధుల, వికలాంగుల పోస్టల్ ఓటింగ్



**హైదరాబాద్, నవంబర్ 21 (సమ సమాజం):** తెలంగాణలో నవంబర్ 30న జరగనున్న పోలింగ్ నేపథ్యంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం లెక్కింపునకు సంబంధించి ఇప్పటి నుంచే సర్వం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా 49

3వ పేజీలో...

# నన్ను ఓడించేందుకు కుట్రలు : సీతక్క



ములుగు,నవంబర్ 21 (సమ సమాజం): నన్ను ఓడించేందుకు బీఆర్ఎస్ పెద్దలు అనేక కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఈవీఎంలలో తన ఫోటో, గుర్తు సైజు తగ్గించారన్నారు. దీనిపై మా కార్యకర్తలు అర్ధరాత్రి వరకూ నిరసన తెలిపారన్నారు. జిల్లా కలెక్టర్ బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ కండువా లేని బీఆర్ఎస్ కార్యకర్తగా పనిచేస్తున్నారని సీతక్క పేర్కొన్నారు. మహిళా కలెక్టర్ అని గౌరవం ఇస్తున్నామని.. అయినా ఆమె బీఆర్ఎస్ కు అనుకూలంగా పనిచేస్తున్నారన్నారు. కలెక్టర్‌పై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తనను ఓడించేందుకు అనేక కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రజలకు మద్దతుగా ఉండే తనను అణచివేసి ఇక్కడి వనరులను దోచుకోవాలని చూస్తున్నారన్నారు. విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేస్తున్నారని సీతక్క పేర్కొన్నారు.

# ప్రజల బాగోగులు ఒక్క బిఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యం : గంగుల



కరీంనగర్,నవంబర్ 21 (సమ సమాజం): ఎంపీ బండి సజయ్ ఏనాడూ కరీంనగర్, తెలంగాణ ప్రజల బాగోగులను పట్టించుకోలేదని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాష్ట్రంలో మతాల మధ్య చిచ్చుపెట్టి, కులాల కుంపట్లు రాజేసి రాజకీయం పబ్బం గడుపుకోవాలని చూడటం హేయమన్నారు. ఇలాం వ్యక్తులకు తెలంగాణ రాజకీయాల్లో చోటులేదని చెప్పారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్‌తో కలిసి మంత్రి గంగుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులను 2018 నాటికే పూర్తిచేశామని, అయినా 2019లో ఎంపీగా గెలిచిన సంజయ్ తానే స్మార్ట్ సిటీ సాధించానని చెప్పుకోవడం ఆయన రాజకీయ అవివేకానికి, స్వార్థానికి నిదర్శనమన్నారు. కరీంనగర్ పట్టణానికి స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు మోకాలడ్డినా సాధించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని చెప్పారు. నాడు ఎంపీగా ఉన్న వినోద్, తనను పిలిచి స్మార్ట్ సిటీ పనులను అప్పగించారని తెలిపారు. అప్పుడు ఇదే కార్పోరేషన్‌లో కార్పోరేటర్‌గా ఉన్న బండి సంజయ్‌ని స్మార్ట్ సిటీ సాధన కోసం పోరాడుదామంటే రాకుండా పారిపోయారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తులకు ఈ నెల 30న తమ అమూల్యమైన ఓటుతో తగిన సమాధానం చెప్పాలన్నారు.

# కృష్ణా జలాల పంపిణీ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం : టీడీపీ నేత దేవినేని ఉమ



విజయవాడ,నవంబర్ 21 (సమ సమాజం): కృష్ణా జలాల పంపిణీ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని టీడీపీ నేత దేవినేని ఉమ విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ జగన్ కేసులు వాదించడానికి వందల కోట్లు లాయర్లకి ఇస్తున్న జగన్ కృష్ణా జలాలపై కోర్టుకి వెళ్ల లేకపోతున్నారన్నారు. ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిన ప్రాంతాల్లో తీసుకొన్న చర్యలు ఏంటి అని ప్రశ్నించారు. చంద్రబాబును తిట్టడానికి తప్ప ఇరిగేషన్ మంత్రి శాఖాపరమైన అంశాలపై మాట్లాడం లేదన్నారు. షెడ్యూల్ 9, 10 ప్రకారం రాష్ట్రానికి లక్ష కోట్లు రావాలన్నారు. జగన్ మొద్దు నిద్ర విడవడానికి 50 నెలలు సమయం పట్టిందని వ్యాఖ్యలు చేశారు. తెలివి తక్కువ, చేతకాని, చేయలేని ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదు.. భవిష్యత్‌లో చూడమన్నారు. పోలవరం డ్యాంని జగన్ బ్యారేజ్ చేశారని దేవినేని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గ్యారంటీ పథకాలపై ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా




నిజామాబాద్,నవంబర్ 21 (సమ సమాజం): :కర్ణాటకలో అమలు చేస్తున్న గ్యారెంటీలపై ఓపెన్ ఛాలెంజ్‌కు బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి సిద్ధమా అని కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ సవాల్ విసిరారు. మంగళవారం మీడియాతో కర్ణాటక ఎమ్మెల్యే మాట్లాడుతూ "రేపు (బుధవారం) వేల్పూర్ చౌరస్తాకు 12 గంటలకు వస్తా నీవు రా కర్ణాటక గ్యారెంటీలపై చర్చిద్దాం. బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారంలో అబద్ధలు ప్రచారం చేస్తున్నారు. కర్ణాటకలో ఇచ్చిన అన్ని గ్యారెంటీలు అమలు చేస్తున్నాం. ప్రతి ఒక్క గ్యారెంటీ పథకాన్ని అమలు చేస్తున్నాం. 50 వేల కోట్లతో గ్యారెంటీల అమలు కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాము. కారులో వెళదామ కర్ణాటకకి విమానంలో వెళదామ ఖర్చు అంత నాదే మీ భద్రకు నాదే బాధ్యత రండి మీ కార్యకర్తలను తీసుకొని. ఏ ఊరికి వెల్దామో చెప్పు అక్కడ మేము ఇచ్చిన గ్యారెంటీలో అమలు చేస్తున్నామో లేదో నిరూపిస్తా. అక్కడ గ్యారెంటీలు అమలు చేస్తున్నట్లు ఉంటే మీరు వచ్చి ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పండి. ఓడిపోతున్నాం అని తెలిసి అబద్దాలు చెప్పడం కరెక్ట్ కాదు ప్రశాంత్ రెడ్డి. ఈ ఛాలెంజ్‌కు సిద్ధమా ప్రశాంత్ రెడ్డి రేపు 12 గంటలకు వేల్పూర్ చౌరస్తా కి రా. కాంగ్రెస్ సోనియా గాంధీ (రానీనితిజీ ఉజీనిటప్త్రతి) తెలంగాణ ఇస్తే మీరు అధికారం అనుభవిస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుల బలిదానాలపై తెలంగాణ వస్తే. ఆ కుటుంబంలో ఎందరికి ఎమ్మెల్యే టికెట్ పదవులు ఇచ్చారో తెలపాలి" ప్రదీప్ ఈశ్వర్ డిమాండ్ చేశారు.

# ఏపీలో రెండు రోజులు భారీ వర్షాలు



నెల్లూరు,నవంబర్ 21 (సమ సమాజం): ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో వర్షాలు దంచి కొడుతున్నాయి. రెండు రోజులుగా అక్కడక్కడ పడుతున్న వర్షాలు%ాా%.నిన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేటలో వర్షం దంచి కొడుతోంది. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమ, నెల్లూరు జిల్లాలో జలాశయాలు పూర్తిగా నిండుకున్నాయి. దీంతో పంటల సాగుకు చుక్క నీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పుడు జోరు వానలతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు భారీ వర్షాల కారణంగా సూళ్లూరుపేటలో నిర్వహించాల్సిన సీఎం వైఎస్ జగన్ పర్యటన రద్దయింది.

# కెసిఆర్ పాలనలో ఆంధ్రావాళ్లు కూడా ఫిదా లింగాల కమలారాజ్



ఖమ్మం,నవంబర్ 21 (సమ సమాజం): సీఎం కేసీఆర్ సుపరిపాలన చూసి ఆంధ్ర సరిహద్దు గ్రామాల ప్రజలు తాము కూడా తెలంగాణలో ఉంటే బాగుండునని కోరుకుంటున్నారని జెడ్పీ చైర్మన్, మధిం బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్ రాజ అన్నారు. మంగళవారం మధిరలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దళితుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. దళితబంధు పథకాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించడం గొప్ప విషయం అన్నారు. మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క అడగకపోయినా సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి వంద పడకల దవాఖానను మంజూరు చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ మధిరను మున్సిపాలిటీ చేసి గాలికి వదిలేస్తే సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగాలంటే కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# బిఆర్ఎస్ మేనిఫెస్టోతో పేదలకు మేలు : నిరంజన్‌రెడ్డి



వనపర్తి,నవంబర్ 21 (సమ సమాజం): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని, మ్యానిఫెస్టోను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలని వనపర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామానికి చెందిన బీఎస్పీ, కాంగ్రెస్ యువకులు, బుద్దారం మాజీ సర్పంచ్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ శేఖర్ గౌడ్, ఎంపీటీసీ విష్ణు, సర్పంచ్ నీలకంఠ ఆధ్వర్యంలో 20 మంది, చెన్న రాములు ఆధ్వర్యంలో అంజనగిరి, జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, జిల్లా కేంద్రం లోని హరిజన వాడలో టీడీపీ సీనియర్ నాయకుడు గంధం బాలపీరుతో పాటు 100 మంది నాయకులు వేరువేరుగా మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మేలు జరగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. పాత, కొత్త నాయకులు అందరు కలిసి కట్టుగా పని చేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాకనాటి కృష్ణయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అన్నం పెడితే... కాంగ్రెస్ సున్నం పెట్టది : జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట,నవంబర్ 21 (సమ సమాజం): తెలంగాణ ప్రజలకు అన్నం పెట్టింది కేసీఆర్ అయితే..సున్నం పెట్టేది కాంగ్రెస్ అని సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆత్మకూరు మండలం తుమ్మల పెన్ పహాడ్, కోటపహాడ్, శెట్టిగుడెం, జొట్య తండా, అశ్లా తండా లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కారు గుర్తుకు వేసిన ఓటు రైతుల బీడు భూములను సస్యశ్యామలం చేసింది అన్నారు. 25 ఏండ్లు దామోదర్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు. దామోదర్ రెడ్డి మా గ్రామానికి ఈ పని చేసిండని చెప్పే దమ్ము ఏ గ్రామ కాంగ్రెస్ నాయకుడికైనా ఉందా? అంటూ సవాల్ విసిరారు. విస్నూర్ రామచంద్ర రెడ్డి వారసుడు దామోదర్ రెడ్డి అయితే నేను బి.ఎన్, ధర్మ భిక్షం వారసుడినని పేర్కొన్నారు. ఆయనకు చేతనైతే అభివృద్ధిలో పోటీపడాలన్నారు. సూర్యాపేటలో ఇళ్లు లేని ప్రతి ఒక్కరికి ఇళ్లు కట్టించే బాధ్యత నాదే అన్నారు. ఆశీర్వదించండి మీ ఇంటి వాడిగా సేవ చేస్తానని విజ్ఞప్తి చేశారు. మంత్రి ప్రచారం సందర్భంగా కోటపహాడ్ కు చెందిన కాంగ్రెస్ నాయకులు కందాల ఆనంద్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు జానయ్య , రమేష్, లింగయ్య, లతీఫ్, సురేష్, మల్లయ్య, గణేశ్, గంగయ్య, లక్ష్మారెడ్డి తో పాటు యూత్ అధ్యక్షుడు వెంకటేష్‌తో పాటు పలువురు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

# ఆశల పల్లకిలో కాంగ్రెస్.. !



హైదరాబాద్, నవంబర్ 21 (సమ సమాజం): ఈ సారి తెలంగాణా అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ చాలా ఆశలు పెట్టుకుంది. కొద్ది నెలల క్రితం వరకు స్తబ్ధంగా ఉన్న ఆ పార్టీ ఊహించని రీతిలో పుంజుకుంది. ఎదురులేదనుకున్న బీఆర్ఎస్‌తో ఇప్పుడు నువ్వా నేనా అన్నట్టుగా పోటీ ఇస్తోంది. ప్రజాకర్షణమ్యాని ఫెస్టోతో ఇక గెలుపు తమదే అన్న రీతిలో ప్రచారం నిర్వహిస్తోంది. దీంతో, ఇప్పుడు ఎన్నికలు జరు గుతున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లతోపాటు తెలంగాణాలో కూడా విజయం సాధిస్తే 'ఇండి యా' కూటమిలో తన నాయకత్వానికి గౌరవం పెరుగుతుందనీ, ఆత్మవిశ్వాసంతో పార్లమెంట్ ఎన్నిక లను ఎదుర్కోవచ్చనీ ఆ పార్టీ వ్యూహం. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ గెలుపుపై ఎవరికీ పెద్దగా అనుమా నాల్లేవు. మధ్యప్రదేశ్‌లో కూడా సులభంగానే గెలుస్తామనే ధీమా ఆ పార్టీలో కనబడింది. పోలింగ్ సరళిని పరిశీలించిన తర్వాత కాంగ్రెస్ భారీ విజయాన్ని నమోదు చేయ వచ్చని పరిశీలకులు కూడా అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రదేశ్ పరిస్థితి ఇట్లా ఉంటే ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని మార్చేసే సంప్రదాయమున్న రాజస్థాన్‌లో కాంగ్రెస్ గెలుపు అనుమానమే అంటున్నారు. అయితే అక్కడా కాంగ్రెస్ గ్యారంటీలు విజయం అందిస్తాయని సీఎం గెహ్లాట్ పూర్తి నమ్మకంతో ఉన్నారు. ఒక వేళ రాజస్థాన్‌ను కోల్పోతే ఆ లోటును తెలంగాణతో భర్తీ చేసుకోవాలని కాంగ్రెస్ బావిస్తోంది. కర్ణాటక ఎన్నికలు, బండి సంజయ్‌ను నాయకత్వం నుంచి తప్పించడం జరిగిన తర్వాత బీజేపీ బలహీనప డినట్టు కనిపించడం కూడా కాంగ్రెస్ ఆశలకు ఊపిరిపోసింది. ఇప్పటికే పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌పై సహజంగానే వ్యతిరేకత ఉంటుందనీ, అది తమకు కలిసివస్తుందనీ కూడా కాంగ్రెస్ అం చనా వేసుకున్నది. ఈ ప్రభుత్వ వ్యతిరేకత మీదనే ఆధారపడకుండా ఒక భారీ ఎన్నికల మేనిఫెస్టోను కూడా ప్రకటించింది. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఆరు గ్యారెంటీలను, ఐదు డిక్లరేషన్‌లను, రెండు లక్షల ఉద్యోగాలను, ఇంకా అనేక హామీలను ప్రకటించిం ది. మరి వీటికి డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది? కాంగ్రెస్ లెక్కల ప్రకారం గడిచిన రెండు సంవత్స రాల్లో రాష్ట్ర ఆదాయ , వ్యయాలు దాదాపు సమానంగా ఉన్నాయి. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు అ య్యే వ్యయాన్ని లెక్కేస్తే అదనంగా ఏటా 60 నుంచి 70 వేల కోట్లు అవసర మవుతాయి. వీటికి తోడు రైతులకు రెండు లక్షల రూపాయల రుణ మాఫీ చేస్తే అదే 38 వేల కోట్లు. ఒక్కో ఇంటికి 5 లక్షల చొప్పున పది లక్షల ఇళ్లు కేటాయిస్తే 50 వేల కోట్లవుతుంది. ఇలా ఒకసారి పెట్టే ఖర్చు ఈ రెండు పద్దులకే 88 వేల కోట్లు. అయితే ఈ రెండు హామీలను దశల వారిగా నెరవేర్చే అవకాశం ఉంది. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ వ్యతిరేక ఓటు అధికంగా కాంగ్రెస్ వైపు ఉంటేనే హస్తం విజయం సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు కొన్ని నియోజకవర్గాలు మినహాయిస్తే బీజేపీ ఓటింగ్ ఎక్కడా ఐదు శాతం మించే అవకాశం లేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 3 శాతం ఓట్లనే పొందిన కాషాయ పార్టీ ఇప్పుడు డబుల్ డిజిట్ ఓటింగ్ శాతాన్ని నమోదు చేసుకోవచ్చని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా నిరుద్యోగ యువత, ప్రభుత్వ ఉద్యోగుల్లో ప్రభుత్వ వ్యతిరే కతకు తోడు ఈ సారి మైనార్టీ ఓటర్లు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టుగాకనిపిస్తోంది. ఈ రెండు అంశాలు కాంగ్రెస్‌కు లాభం చేకూర్చేవే. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న యువ ఓటర్లు వృద్ధ ఓటర్లను తీవ్రం గా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇక సోషల్ మీడియాలో కూడా కాంగ్రెస్ ప్రచార జోరును ఈ యువత విజయవంగా ముందుకు తీసుకువెళుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ నడుస్తోందనే బావన కల్పిస్తున్నాయి. చూడాలి ఫలితం ఎలా ఉంటుందో!

# ఆస్తులన్నీ ప్రజలకు పంచేందుకు సిద్ధమా : బండి సంజయ్



కరీంనగర్,నవంబర్ 21 (సమ సమాజం): మంత్రి గంగుల కమలాకర్‌పై బీజేపీ నేత బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గంగులను ఎందుకు గెలిపించాలని ప్రశ్నల వర్షం కురిపించారు. అవినీతిపరులు ఎవరో తేల్చుకుందామని.. ఆస్తులన్నీ ప్రజలకు పంచేందుకు సిద్ధమా అంటూ బండి సంజయ్ సవాల్ విసిరారు. "గంగుల? నిన్నెందుకు గెలిపించాలి. రేషన్ మంత్రివి.. ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చావా? బీసీ మంత్రివి? ఎంత మందికి బీసీ బంధు ఇచ్చినవ్? వడ్ల మంత్రివి? తాలు, కటింగ్ పేరుతో క్వింటాలుకు 10 కిలోలు దోచుకుంటావా? పంట నష్టపోతే పరిహారం ఎందుకివ్వలేదు? 15 ఏళ్లుగా ఎమ్మెల్యేవి.. పేదలకు ఇండ్లు ఎందుకు ఇవ్వలేదు? సిగ్గు లేకుండా పేదల ఇండ్లను కూల్చివేయిస్తావా? ఎంపీగా కరీంనగర్ అభివృద్ధి కోసం నేను తెచ్చిన నిధులివిగో.. అవినీతిపరులు ఎవరో తేల్చుకుందామా?.. ఆస్తులన్నీ ప్రజలకు పంచేందుకు సిద్ధమా?" అంటూ బీజేపీ నేత ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే.. వరికి మద్దతు ధర రూ.3100 ఇస్తామని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

# కెసిఆర్ ధన బలాన్ని, ప్రజా బలానికి మధ్య పోరు పొంగులేటి



ఖమ్మం,నవంబర్ 21 (సమ సమాజం): కేసీఅర్ ధన బలానికి.. ప్రజా బలానికి మధ్య జరుగుతున్న పోరాటమే ఈ ఎన్నికలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేడు ఆయన చర్లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. కేసీఆర్ పాలనలో నిరుద్యోగులు మోస పోయారన్నారు. కరెంట్ విషయంలో కేసీఆర్ గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు చూపిస్తున్నాయన్నారు. భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యను గెలిపించాలని పొంగులేటి పిలుపునిచ్చారు.

# బెదిరిస్తే భయపడం : ఈటల



సిద్దిపేట,నవంబర్ 21 (సమ సమాజం): గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని మల్లన సాగర్ భూ నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీలో ఈటెల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బెదిరిస్తే భయపడం.. మేము ఫైటర్లం. ప్రజలకు అండగా ఉంటాం.. కాలికి ముళ్ళు గుచ్చితే పన్నుతో తిస్త. ఎవరైతే మల్లన్న సాగర్ భూ నిర్వాసితులను చెట్టుకొకలను పుట్టకొకలను చేశారో వాళ్ళే నా పై పోటీ చేసే దమ్ము లేక బీజేపోల్లను రానివ్వొద్దు అంటున్నారు. మీకు బాధ ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టండి. ప్రభుత్వ విలువ ప్రకారం భూ నిర్వాసితులకు నష్టపరిహారం ఇస్తుంటే మార్కెట్ ధర ప్రకారం ఇవ్వాలని నేను అన్నా నా మాట వినలేదు. భూ నిర్వాతులకు భూములను దూరం చేసి వాళ్ళను అడ్డా మీద కూలీలను చేశారు. దౌర్జన్యాన్ని, పోలీసులను నమ్ముకున్నోల్లు ఎప్పటికీ బాగుపదరు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంవత్సరానికి నాలుగు సిలిండర్‌లు ఉచితంగా అధిస్తాం. అదే విధంగా కళ్యాణ లక్ష్మీ లక్ష నుంచి రెండు లక్షలకు పెంచుతాం. రూ.2100 ఉన్న వడ్లకి రూ.3100లకు పెంచుతూ మొత్తం ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేస్తాం" అని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

# ఎన్నికలంటే పండుగ కాదు... ఐదేళ్ల భవిష్యత్



సిద్దిపేట,నవంబర్ 21 (సమ సమాజం): ఎన్నికలు అంటే మూడు రోజుల పండుగ కాదు, ఐదేళ్ల భవిష్యత్, మన అభివృద్ధి. సీఎం కేసీఆర్ సీఎం అయ్యాక హుస్నాబాద్ ఎంతో అభివృద్ధి చెందింది. గతంలో ఎంతో మంది వచ్చి వెళ్లారు. నీళ్ళు ఇవ్వలేదు, రోడ్లు ఇవ్వలేదు. అన్ని రంగాల్లో నేడు హుస్నాబాద్ అభివృద్ధి చెందుతున్నదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. మంగళవారం హుస్నాబాద్ నియోజక వర్గం కొహెడ రోడ్ షోలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ వల్ల కాళేశ్వరం అయ్యింది. శనిగరం ద్వారా నీళ్లు వస్తున్నాయి. అన్ని గ్రామాలకు మహిళా భవనాలు పూర్తి చేశామన్నారు. కరోనా వచ్చిన నాడు ఎవరు రాలేదు. కాంగ్రెస్ వాళ్లు ఎక్కడ ఉన్నరని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అని చెప్పి కర్ణాటకలో మోసం చేశారు. వాళ్ల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందన్నారు. కాంగ్రెస్ ను నమ్మితే కైలాసం ఆటలో పాము మింగినట్టే. ఆరు గ్యారెంటీలు ఏమో గానీ, ఆరు నెలలకు ఒక్కరూ సీఎం అవుతారన్నారు. పొన్నం ప్రభాకర్ పెద్ద పెద్ద పోస్టర్లు వేశారు. వాళ్ల దాంట్లో ఉన్న దానికంటే మన మేనిఫెస్టో ఎంతో మంచిదన్నారు. బీజేపీ వాళ్లు కరెంట్‌కు మీటర్లు అంటే, కాంగ్రెస్ వాళ్లు మూడు గంటల కరెంట్ అంటున్నారు. విరామం లేకుండా కరెంట్ ఇచ్చిన కేసీఆర్ ను, విరామం లేకుండా గెలిపించాల్సిన బాధ్యత మన పై ఉందన్నారు. కాంగ్రెస్ నమ్మితే కుక్కతోక పట్టుకొని గోదారి ఈదినట్టేనని, ఎమ్మెల్యేగా సతీష్‌ను మంచి మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

# దాల్మియా సిమెంట ఫ్యాక్టరీలో తీవ్ర ఉద్రిక్తత

కడప,నవంబర్ 21 (సమ సమాజం): కడప జిల్లాలోని మైలవరం మండల పరిధిలో ఉన్న దాల్మియా సిమెంట ఫ్యాక్టరీలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో ఫ్యాక్టరీ సమీపంలోని నవాబుపేట గ్రామస్తులు ఆందోళనకు దిగారు. నాపరాయి కోసం మోతాదుకు మించి బ్లాస్టింగ్ చేయడం వల్ల తమ ఇళ్లు నెర్రలుచీలి దెబ్బ తింటున్నాయని, పంటపొలాలు పాడవుతున్నాయని నవాబుపేట ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంట్ ప్లాంట్ గేటు మూసి వేసి విధులు జరగకుండా ఆందోళన కారులు అడ్డుకున్నారు. దీంతో నవాబుపేట గ్రామస్తులకు పరిశ్రమ సిబ్బందికి ఇరువురి మధ్య తోపులాట జరిగింది. తోపులాటలో దాల్మియా సిమెంట్స్ అద్దాలు ధ్వంసం అయ్యాయి. పోలీసుల రంగ ప్రవేశంతో గొడవ సద్దుమణిగింది.

# ఆ గవర్నర్లపై కొరడా ఝులిపించిన సుప్రీంకోర్టు!



ప్రతిపక్ష రాష్ట్రాల్లో గవర్నర్ల తీరు మునుపెన్నడూ లేనివిధంగా విమర్శలు ఎదుర్కొంటుంది. వారు అవలంభిస్తోన్న ఘర్షణ దోరణిని యావత్ దేశ ప్రజలు కొంతకాలంగా గమనిస్తున్నారు. చివరకు గవర్నర్ల తీరును నిరసిస్తూ ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలు ఉన్నత న్యాయస్థానాలకు ఆశ్రయించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు గవర్నర్ల వ్యవహార శైలిని ఆక్షేపించింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు ఎంతకీ ప్రజాస్వామికం కాకపోడంతో సుప్రీం కోర్టు గట్టిగా కొరడా ఝుళి పించక తప్ప లేదు. దానితో దిగి వచ్చిన తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తన వద్ద మూడేళ్ళుగా పెండింగ్‌లో వున్న పది బిల్లులను ఒకేసారి ముఖ్యమంత్రి ఎమ్‌కె స్టాలిన్ ప్రభుత్వానికి తిప్పి పంపా రు. ఎటువంటి అభిప్రాయం వెల్లడించకుండా బిల్లులు వెనక్కి పంపించడం ద్వారా గవర్నర్ ఎక్కడ లేని అసహనాన్ని ప్రదర్శించి రాజ్‌భవన్ కు తగని రీతిలో వ్యవహరించారు. అయితే, తమిళనాడు లోని డీఎంకే ప్రభుత్వం వెనువెంటనే గత శనివారం నాడే శాసన సభను ప్రత్యేకంగా సమావేశపరచి ఆ బిల్లులకు తిరిగి ఆమోదం పొందింది. బిల్లులను శాసన సభ యథాతథంగా తిరిగి ఆమోదించి పంపిన తర్వాత వాటిపై తన సమ్మతి ముద్రను వేసి పంపించకుండా తన వద్ద వుంచుకొనే అధికారం గవర్నర్‌కు లేదని రాజ్యాంగం 200 అధికరణ స్పష్టం చేస్తోంది. దీని ప్రకారం శాసన సభ ఆమోదంతో తమ వద్దకు వచ్చే బిల్లులను గవర్నర్లు సాధ్యమైనంత త్వరగా ఆమోద ముద్ర వేసి రాష్ట్ర ప్రభుత్వా నికి పంపించాలని సుప్రీం కోర్టు గత ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసుకొన్న పిటిషన్‌పై స్పందిస్తూ దృఢంగా అభిప్రాయపడింది. అసెంబ్లీలో పచ్చజెండా ఊపి పంపిన బిల్లులకు ఆమోద ముద్ర వేయవలసిందిగా గవర్నర్‌కు ఆదే శించాలని ఆ పిటిషన్‌లో సుప్రీం కోర్టును తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఇది జరిగిన తర్వాత కూడా తమిళనాడు గవర్నర్ తన వద్ద గల బిల్లులకు విముక్తి ప్రసాదించలేదు. పది బిల్లులను తిప్పి పంపిన ఆయన మరి కొన్ని బిల్లులను ఇంకా తన వద్ద వుంచుకున్నట్టు సమాచారం. రాజ్‌భవన్లు, గవర్నర్లు వున్నది కేంద్రం ఏజెంట్లుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధులుగా పని చేయడానికే కాదు, రాష్ట్రాల్లో పాలన ఎటువంటి ఆటంకాలు లేకుండా సాగేలా తోడ్పడానికే తప్ప తామే ఆటంకాలు కా వడానికి కాదు కదా! 200 అధికరణ ప్రకారం గవర్నర్లు బిల్లులను ఆమోదించడమో, తిరస్కరించడం లేదా తిప్పి పంపడమో, ప్రత్యేక నేపథ్యంలో వాటిని రాష్ట్రపతికి నివేదించడమో చేయాలి. పెండింగ్ బిల్లులను ఆమోదించి పంపేలా గవర్నర్లను ఆదేశించాల్సిందని తెలంగాణ, తమిళనాడు, కేరళ, పంజాబ్ ప్రభుత్వాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఈ నెల 6న పంజాబ్ ప్రభుత్వ పిటిషన్‌ను విచారిస్తూ తాము ఆ రాష్ట్ర ప్రజలెన్నుకున్న ప్రతినిధులు కాము అనే వాస్తవాన్ని గవర్నర్లు గుర్తించాలని సుప్రీం కోర్టు సూటిగా చెప్పింది. ఎన్నికైన ప్రభుత్వా ల శాసన నిర్మాణ కార్యకలాపాల్లో తమకు పరిమిత అధికారాలే వుంటాయన్న విషయాన్ని వారు గ్రహించాలని చెప్పింది. అంతేకాకుండా ప్రభుత్వాలు తమ శాసన సంబంధమైన అధికారాల విష యంలో న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితిని కల్పించ వద్దని కూడా గవర్నర్లకు సుప్రీం కోర్టు బుద్ధి చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ సారథ్యంలోని ముగ్గురు జడ్జీల ధర్మ పీఠం తాజాగా సోమవారం నాడు తమిళనాడు కేసులో విచారణ జరుపుతూ గవర్నర్ రవి తీరుపై తీవ్రంగా వ్యాఖ్యానించింది. 2020 నుంచి బిల్లులను ఆయన తన వద్ద వుంచుకోడం ఆందోళనక ర మైన విషయమని అభిప్రాయపడింది. పంజాబ్ కేసులో తాము నవంబర్ 10న ఆదేశాలు జారీ చేసిన తర్వాతనే తమిళనాడు గవర్నర్‌లో కదలిక వచ్చిందంది. తాము నోటీసు ఇచ్చిన తర్వాతనే తమిళ నాడు గవర్నర్ దారికి వచ్చారని చెప్పింది. మూడేళ్ళుగా ఈయన ఏమి చేస్తున్నట్టు, రాష్ట్ర ప్రభు త్వం సుప్రీం కోర్టును ఆశ్రయించినంత వరకు ఎందుకు క్రియారహితంగా వున్నట్టు అని ప్రశ్నించింది. విచారణను వచ్చే నెల 1కి వాయిదా వేసింది. శాసన సభ ప్రత్యేక సమావేశాన్ని జరిపించి గవర్నర్ పంపిన బిల్లులను తిరిగి ఆమోదింప చేసినట్టు తమిళనాడు ప్రభుత్వం ధర్మాసనానికి తెలియజేసిం ది. గవర్నర్ తమకు రాజకీయ శత్రువుగా వ్యవహరిస్తున్నట్టు తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసి వుంది. పందెపు సొమ్ముతో ఆన్‌లైన్ జూదం ఆడడానికి సంబంధించిన బిల్లును, వైద్య విద్యలో ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జాతీయ యోగ్యత పరీక్ష (నీట్) రద్దు బిల్లును ఇంతకు ముందు తమిళనాడు గవర్నర్ తిప్పి పంపగా వాటిని కూడా శాసన సభ పునరామోదంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌కు మళ్ళీ పంపింది. ఆ తర్వాత నీట్ బిల్లును గవర్నర్ రవి రాష్ట్రపతికి పంపిం చారు. ఈ బిల్లు విషయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి పత్రాన్ని కూడా సమ ర్పించారు. ఇదంతా చూస్తుంటే కేంద్రంలోని బీజేపీ పాలకులు రాష్ట్రాల్లోని ప్రతిపక్ష ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టి ఇబ్బందులపాలు చేయడానికి గవర్నర్లను సాధనాలుగా ఉపయోగించుకొంటు న్నారనే వాదనకు బలాన్నిస్తోంది.

## చంద్రబాబు బెయిల్‌ను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకు సీఐడీ



(మొదటి పేజి తరువాయి) సమర్పించలేకపోయిందని.. ఇప్పటికే హైకోర్టు తేల్చిచెప్పింది. ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నప్పుడు చంద్రబాబుకు రిమాండ్ విధించాలని అభ్యర్థించక ముందే తగిన ఆధారాలను సేకరించి ఉండాల్సిందని అభిప్రాయపడింది. నిధులు టీడీపీ ఖాతాలోకి చేరాయనేందుకు దర్యాప్తు సంస్థ వద్ద ఆధారాలేవీ లేవని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని దర్యాప్తు లోపంగా భావిస్తున్నామని పేర్కొంది. ఇప్పటికే సుప్రీంకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై తీర్పు పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే.

## రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత కేసీఆర్‌దే




(మొదటి పేజి తరువాయి) పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని.. బీఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరిగారు. బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి.. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులపాలు చేశారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయ భేరి సభలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పాలనలో అన్నదాతలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్న రేవంత్.. రైతన్నకు భరోసా కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో హస్తం పార్టీకి సంపూర్ణ మద్దతు పలకాలని కోరారు. బీఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పించిన రేవంత్... పదేళ్ల కేసీఆర్ పాలనలో నిధులన్నీ గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేట నియోజకవర్గాలకే మళ్లించారని వెనుబడిన పాలమూరును మరింత వెనకకు నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆగర్భ శ్రీమంతులుగా కల్వకుంట్ల కుటుంబ మాత్రమే బాగుపడిందని.. యావత్తు ప్రజానీకం అప్పుల ఊబిలోకి జారుకుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో రూ. లక్ష కోట్లు దోపిడీ చేసి.. లక్షలాది రూపాయలు సంపాదించుకొని ఈరోజు కేసీఆర్, కేటీఆర్ వారి పార్టీలో ఉన్నవాళ్ల కలలు మాత్రమే నెరవేరాయి. ఈ పది సంవత్సరాల్లో ఎవరైనా బాగుపడ్డారంటే.. ఎవరైనా ఆగర్భ శ్రీమంతుడు అయ్యారంటే.. ఎవరికైనా ఫామ్ హౌస్?లు వచ్చాయంటే.. ఎవరైనా విలాసవంతమైన జీవితం గడుపుతున్నారంటే అది కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమేనని అన్నారు. ఇక అభివృద్ధి కోసం ఎవరి దగ్గరో చేతులు చాచడం కాదని.. మీ అభివృద్ధి.. మీ భవిష్యత్తు మీ చేతిలోనే ఉందని అది మీరు వేసే ఓటు నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. వనపర్తికి పరిశ్రమలు రావాలంటే ఇక్కడ కాంగ్రెస్ గెలవాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని.. కేసీఆర్ కుటుంబం.. పార్టీ నేతల కలలు మాత్రమే నెరవేరాయని విమర్శించారు. మంత్రి నిరంజన్ రెడ్డిపై రేవంత్ ఫైర్..: లక్ష కోట్ల కేసీఆర్ అవినీతికి కాళేశ్వరం మూడేళ్లకే ఇసుక కదిలింది.. మేడిగడ్డ కూలిందని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డిపై విమర్శలు గుప్పించిన రేవంత్ రెడ్డి.. లాల్చీ వేసుకున్న ప్రతివాడూ లాల్ బహదూర్ శాస్త్రి కాదు.. పంచె కట్టిన ప్రతివాడూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాదంటూ మంత్రి నిరంజన్ రెడ్డిపై వ్యంగ్యస్త్రాలు సంధించారు. పంచె కట్టుకుని నిరంజన్ రెడ్డి తనకు తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డిని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కేబినెట్?లో అత్యంత అవినీతిపరుడని ఆరోపించారు. గుడి, బడి అని తేడా లేకుండా కబ్జాలు చేశారని వందల ఎకరాల్లో ఫామ్ హౌస్‌లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 59 ఏళ్లలోపు చనిపోయిన రైతులు 83వేలు ఉంటే.. కేంద్రం లెక్కల ప్రకారం మరో 9 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని.. దీంతో 91వేల రైతుల చావులకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజ్‌రెడ్డి బాధ్యత వహించాలన్నారు. రైతు ఆత్మహత్యలను ఆపేందుకే కాంగ్రెస్ రైతు భరోసా పథకం ప్రకటించిందని తెలిపారు. పదేళ్లు కేసీఆర్?కు అవకాశం ఇచ్చారని.. ఒక్క అవకాశం కాంగ్రెస్? పార్టీకు ఇవ్వమని అభ్యర్థించారు.

## నచ్చిన పేర్లను ఎంపిక చేయడమేంటి?



(మొదటి పేజి తరువాయి) సీనియర్లని అవే పేర్కొంది. 'జడ్జీలుగా నియమితులు కావడానికి ఎవరైనా ఎందుకు ఒప్పుకుంటారు? ఇదే విషయంపై మేం గతంలోనూ పలు కీలక సూచనలు చేశాం. న్యాయమూర్తిగా తనను ఏ సీనియార్టీలో ఉంచుతారన్నది ఒక అభ్యర్థికి కచ్చితంగా తెలియాలి. లేదంటే అర్హులైన అభ్యర్థులను ఒప్పించడం కష్టతరంగా మారుతుంది' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా అంతకుముందు చేసిన కొన్ని పాత సిఫార్సులనూ ధర్మాసనం ప్రస్తావించింది. వాటిలో కొందరి పేర్లను ఒకటి కంటే ఎక్కువ సార్లు ప్రతిపాదించామని తెలిపింది. అయితే మళ్లీ పేర్లను ప్రతిపాదిస్తూ కొలీజియం చేసిన సిఫార్సులకు ఆమోదం తెలిపే ప్రక్రియలో కొంత పురోగతి ఉందని అటార్నీ జనరల్ వెంకటరమణి వివరించారు. అనంతరం తదుపరి విచారణను వచ్చే నెల 5కు వాయిదా వేసింది సుప్రీం.

## గాయని సుశీలకు గౌరవ డాక్టరేట్



(మొదటి పేజి తరువాయి) ఛాన్సలర్, ముఖ్యమంత్రి స్టాలిన్ హాజరయ్యారు. యూనివర్సిటీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించేశారు. అనంతరం సినీ సంగీత పరిశ్రమలో గానకోకిల పి. సుశీలకు ముఖ్యమంత్రి స్టాలిన్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తమిళ అభివృద్ధి, కళాసంస్కృతి, సమాచార శాఖ మంత్రి, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎం.పి.సామినాథన్ పాల్గొన్నారు. అలాగే సంగీత విద్వాంసుడు పీఎం సుందరంకు కూడా గౌరవ డాక్టరేట్ అందించి సన్మానించారు సీఎం స్టాలిన్.సినీ సంగీతం ప్రపంచంలో తన గాన మాధుర్యంతో కోట్లాది శ్రోతల హృదయాలను మైమరపించారు. తెలుగు సినీ రంగంలో దాదాపు 50వేలకు పైగా పాటలు పాడి అలరించారు. అలాగే తమిళం, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, ఒరియా, సంస్కృతం, సింహళ ఇలా ఎన్నో భాషలలో పాటలు పాడి మంత్రముగ్దులను చేశారు. దశాబ్దాలుగా ఎవర్ గ్రీన్ పాటలతో సినీ సంగీత ప్రపంచాన్ని ఏలిన మహారాణి పీ.సుశీల. పి. సుశీల విజయనగరంలో 1935 నవంబర్ 13న జన్మించారు సుశీల. 1950 సంవత్సరంలో రేడియోలో నిర్వహించిన పోటీలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఏ.ఎమ్.రాజాతో కలిసి తెలుగులో కన్నతల్లి అనే తో నేపథ్య గాయనిగా అరంగేట్రం చేసింది. పద్మభూషణ్ అవార్డు, ఐదుసార్లు జాతీయ అవార్డు, మూడుసార్లు తమిళనాడు ప్రభుత్వ అవార్డుతో సహా అనేక అవార్డులు అందుకున్నారు పి.సుశీల. గతేడాది ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర పోస్టల్ శాఖ ఆమె పేరు మీదు ప్రత్యేక తపాలా స్టాంపును ఆవిష్కరించింది. 2017లో సైమా లైఫ్ లైమ్ అచీవ్మెంట్ అవార్డు అందుకున్నారు.

## తొమ్మిదేళ్ల పాలనలో వేలకోట్ల అప్పులు



(మొదటి పేజి తరువాయి) పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని వేలకోట్ల అప్పుల పాలు చేశాడని తెలిపారు. రాబోయే తరాల మీద భారం మోపేలా కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలన ఉందన్నారు. అన్ని విధాలుగా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన ఘనత కేసీఆర్‌దని మండిపడ్డారు. తెలంగాణ అవశ్యకతకు సంబంధించిన నీళ్లు, నిధులు నియమాకాలు ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. తెలంగాణకు రావాల్సిన డబ్బును కేంద్రం ఎప్పుడూ ఆపలేదని ఆమె చెప్పారు. వేలకోట్లు అప్పులు తెచ్చి ఒక్క ప్రాజెక్టును కూడా సరిగా పూర్తి చేయలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యత అధ్వానంగా ఉందని, ఫిల్లర్లు కుంగిపోవడం మామూలు విషయం కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ మోసం చేశాడని పేర్కొన్నారు. తాటికొండ రాజయ్యను ఉప ముఖ్యమంత్రిని చేసి ఆరు నెలల్లోనే ఆ పదవి నుంచి తొలగించారన్నారు. కేసీఆర్ ప్రజలు గురించి కాకుండా కేవలం కుటుంబం గురించే ఆలోచిస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. ప్రశ్న పత్రాలు లీకు చేయడం సిగ్గుచేటన్నారు. విద్య ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వలేదని, రాష్ట్రంలో 11 యూనివర్శిటీల్లో 2 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 3016 నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వలేదు.. ఉద్యోగాలు భర్తీ చేయలేదు అని ఆమె తెలిపారు. 17 సార్లు ప్రశ్నపత్రాలు లీక్ చేసి నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకునేలా బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రైతుల ఆత్మహత్యలపై నిర్మలా సీతారామన్ కామెంట్స్ ప్రజలకు ఉపయోగపడే పని ఏదీ బీఆర్ఎస్ చేయడం లేదన్నారు. బంగారం లాంటి రాష్ట్రాన్ని అధ్వాన్నంగా తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో 6 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం తెలంగాణకు జాతీయ పసుపు బోర్డును మోదీ ఇచ్చారని ఆమె తెలిపారు. ఇక బీజేపీ అధికారంలోకి వచ్చాక ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తీసుకువచ్చిన మతపరమైన రిజర్వేషన్లను తొలగిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని, రాజ్యాంగం ప్రకారం ఇప్పుడు ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్సు తీసుకురావడం సాధ్యం కాదని చెప్పారు. జనవరి 22న అయోధ్య దర్శనానికి తెలంగాణ వృద్ధులను ఉచితంగా తీసుకెళ్తామన్నారు. ప్రధాన మంత్రి కావాలని కేసీఆర్ ప్రాంతీయ పార్టీనీ జాతీయ పార్టీగా మార్చారనిన్నారు. అభివృద్ధి పేరుతో అప్పుడు చేస్తున్నారు తప్పా.. ఏం చేయడం లేదన్నారు. హైదరాబాద్‌లో ఎప్పటినుంచో ఉన్న కంపెనీలను చూపిస్తూ అభివృద్ధి అంటున్నారని, కానీ ఇతర జిల్లాలలో మాత్రం ఎలాంటి అభివృద్ధి జరగలేదని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు.

## అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధం




(మొదటి పేజి తరువాయి) లెక్కింపు కేంద్రాలను ఎంపిక చేసింది. ఇప్పటికే పనులు స్టార్ట్ చేసింది ఈసీ. హైదరాబాద్ మహానగరంలో అత్యధికంగా 14 లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు ఎన్నికల సంఘం అధికారులు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మిగిలిన 13 నియోజకవర్గాలకు విడిగా కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లాలో నాలుగు, మిగిలిన జిల్లాల్లో ఒక్కోటి చొప్పున ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 49 ఓట్ల లెక్కింపు కేంద్రాల వివరాలు, ముషీరాబాద్ ఏవీ కళాశాల, దోమల్ గూడ.మలక్‌పేట ఇండోర్ స్టేడియం, అంబర్ పేట, రెడ్డి ఉమెన్స్ కళాశాల, నారాయణగూడ, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం, యూసుఫ్ గూడ. సనత్ నగర్ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఓయూ క్యాంపస్.నాంపల్లి జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్, మాసబ్ ట్యాంక్.కార్వాన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మాసబ్ ట్యాంక్. గోషామహల్ తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి. చార్మినార్ కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల, నాంపల్లి. చాంద్రాయణగుట్ట నిజాం కళాశాల, బషీర్ బాగ్. యాకత్ పురా సరోజిని నాయుడు వనితా మహా విద్యాలయ, నాంపల్లి. బహదూర్ పురా అరోరా కళాశాల, బండ్లగూడ. సికింద్రాబాద్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్, ఓయూ. కంటోన్మెంట్ వెస్లీ కళాశాల, సికింద్రాబాద్. రంగారెడ్డి జిల్లాకు సంబంధించి ఓట్ల లెక్కింపు: ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల ఎక్కింపు సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎల్బీనగర్ నియోజకవర్గ లెక్కింపు సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం, రాజేంద్ర నగర్, చేవెళ్ల, షాద్ నగర్ నియోజకవర్గాల కౌటింగ్ లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు సంబంధించి బాలయోగి స్టేడియం, గచ్చిబౌలిలో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఇక తెలంగాణ వ్యాప్తంగా నవంబర్ 30వ తేదీన ఎన్నికల పోలింగ్ జరుగుతుండగా, డిసెంబర్ 3వ తేదీన కౌటింగ్ చేపట్టేందుకు ఎన్నికల సంఘం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే దశలో ఎన్నికలు ఈ నెల 30న జరగనుండటంతో పోలింగ్‌కు ఈసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక తొలిసారి ఈ ఎన్నికల్లో వృద్ధులు, వికలాంగులు, నడవలేని వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా ఇవాళ ఇంటింటి ఓటింగ్‌లో భాగంగా సీనియర్ సిటిజన్స్ ఓటు వేశారు. ఇక, ఇంటి నుంచే ఓటు వేసేందుకు ముందుగా ఫామ్ డి-12 సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. దీని ద్వారా ఎన్నికల అధికారి వారికి ఓటు వేసేందుకు పర్మిషన్ ఇస్తారు. అయితే, తెలంగాణలో 28,057 మందికి ఇంటి దగ్గర నుంచి ఓటు వేసేందుకు ఈసీ అధికారులు అనుమతించగా ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుంది. అయితే, పోలింగ్ సిబ్బంది, ఎన్నికల పరిశీలకుడి సమక్షంలో వయోవృద్ధులు ఇంటి నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేశాక వాటిని పోలింగ్ సిబ్బంది సేకరించి తీసుకుని వెళ్తున్నారు. ముందుగా సమాచారం అందించి ఓటు వేయించేందుకు పోలింగ్ సిబ్బంది ఇళ్లకు చేరుకుంటున్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది అని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. కాగా, తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లపై సీఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. బీఆర్కే భవన్ లో వీడియో కాన్ఫరెన్స్ లో సీఈఓ వికాస్ రాజ్, అడిషనల్ సీఈఓలు లోకేష్, సర్ఫరాజ్, డిప్యూటీ సీఈఓ సత్యవాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న వృద్ధుల, వికలాంగుల పోస్టల్ ఓటింగ్ పై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో నవంబర్ 30న జరుగనున్న పోలింగ్ పై ప్రధానంగా చర్చించారు.

## రాష్ట్రంలో మరోసారి ఐటీ దాడుల కలకలం

### కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ఇంట్లో సోదాలు




హైదరాబాద్,నవంబర్ 21 (సమ సమాజం): రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో మరోమారు ఐటీ దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులపై ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ అభ్యర్థులపై దాడులు జరుగుతున్నాయి. ఇటీవలే పొంగులేటి శ్రీనివాస్ ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇక తాజాగా చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి ఇల్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లోని సోమాజిగూడ, మంచిర్యాలలోని ఆయన నివాసాల్లో అధికారులు తనిఖీలు జరిపారు. బేగంపేటలోని వివేక్ కార్యాలయంలోనూ సోదాలు చేశారు. అయితే సోమాజిగూడలోని వివేక్ వెంకటస్వామి ఇంట్లో ఐటీ సోదాలు ముగిశాయి. వివేక్ ఇంట్లో ఐటీ అధికారులు నాలుగున్నర గంటల పాటు సోదాలు చేశారు. బ్యాంక్ ఖాతాలో రెండ్రోజుల క్రితం చేసిన నగదు బదిలీకి సంబంధించిన పత్రాలు పరిశీలించినట్లు తెలుస్తోంది. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్?నగర్?లో ఏకకాలంలో వ్యాపారస్థుల ఇళ్లల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్టీలకు అనుబంధంగా ఉన్నటువంటి వ్యాపారుల ఇళ్లల్లో ఉదయం 6 గంటల నుంచి ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. సుమారుగా 8 గంటల సమయం గడిచిపోయింది. అయినప్పటికీ ఇప్పటికీ ఏ విషయం అనేది కొలిక్కి రాలేదు. ఐటీ సోదాలలో ఇప్పటివరకు ఏమేమి దొరికినాయో అంచనా వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఐటీ అధికారులు జిల్లాకు సుమారుగా 20 వాహనాలలో వచ్చినట్టు సమాచారం. ఐటీ అధికారులు చేస్తున్న దాడులతో ఆసిఫాబాద్ జిల్లాలోని బడా వ్యాపారస్థులు, కాంట్రాక్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. మంగళవారం జమ్మికుంటకు చెందిన ఆదిత్య కాటన్ ఇండస్ట్రీస్‌తో పాటు మరో కాటన్ మిల్లు యజమానులు ముక్క నారాయణ, ముక్క శివన్న ఇళ్లల్లో సోదాలు చేశారు. అన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఐటీ అధికారులు స్థానిక పోలీసు బందోబస్తుతో ఈ తనిఖీలు చేపట్టారు. ఐటీ సోదాలు చేస్తున్నారనే సమాచారం రావటంతో వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. సుమారు మూడు గంటల పాటు ఈ తనిఖీలు చేసినట్లు తెలిసింది. మరోవైపుకాంగ్రెస్ నేతలపై ఐటీ సోదాలను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తమ పార్టీ నాయకుల ఇళ్లపై ఆదాయపన్ను శాఖ తనిఖీలు దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల ఇండ్లపై ఐటీ సోదాలు ఎందుకు జరగడం లేదు? అని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సునామీ రాబోతోందని స్పష్టమైందని.. ఆ సునామీని ఆపడానికి చేస్తున్న కుతంత్రమే ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలపొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఐటీ దాడులపై సంచలన వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే ఐటీ అధికారులు తనిఖీ చేసేందుకు ఆయన నివాసానికి వెళ్లడం గమనార్హం. ఈ నెల 9వ తేదీన ఖమ్మం జిల్లాలో మాజీ ఎంపీ, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. ఎనిమిది వాహనాల్లో వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు.. మూకుమ్మడిగా ఇంట్లోకి ప్రవేశించి పొంగులేటితో సహా కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్‌లో ఉన్న పొంగులేటి నివాసం, రాఘవ కన్‌స్ట్రక్షన్‌లోనూ ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఆరోజున నామినేషన్ వేసేందుకు పొంగులేటి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఐటీ దాడులు జరగడం చర్చనీయాంశమైంది. తనపై ఆదాయపన్ను శాఖ దాడులపై పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నాయని మండిపడ్డారు. బీజేపీలోకి రావాలని తనపై ఒత్తిడి చేశారని.. ఆ పార్టీలోకి రాలేదని, అదేవిధంగా హస్తం పార్టీ గ్రాఫ్ పెరిగిందని ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని విమర్శిస్తే ఐటీ సోదాలు జరుగుతాయని తనకు తెలుసని.. తాను ఉహించినట్లే జరుగుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ ఎజెండా ఒక్కటేనని.. తెలంగాణలో కాంగ్రెస్ గెలవకూడదని ప్రయత్నిస్తున్నారని పొంగులేటి విమర్శించారు.

## తెలంగాణలో కాంగ్రెస్‌కు డీఎంకే మద్దతు

### అభ్యర్థుల గెలుపుకోసం పనిచేస్తామని స్టాలిన్ పిలుపు



హైదరాబాద్,నవంబర్ 21 (సమ సమాజం): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రధాన పార్టీలన్నీ తమ ప్రచారాలను హోరెత్తిస్తున్నాయి. అభ్యర్థులు ఇంటింటికీ తిరుగుతూ.. తమకే ఓటు వేసి గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. అదే సమయంలో ముఖ్య నేతలు సైతం సభలు, రోడ్ షోలతో అభ్యర్థులకు మద్దతు కూడగడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తున్న వేళ.. అధికారం ఛేజిక్కించుకునేందుకు ఆ పార్టీ ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోవడం లేదు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తుండగా.. ఏఐసీసీ అగ్రనేతలు సైతం ప్రచారాల్లో పాల్గొంటూ అభ్యర్థుల్లో జోష్ నింపుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే రాష్ట్రంలో సీపీఐ, వైఎస్ఆర్‌టీపీలతో పొత్తు పెట్టుకున్న ఆ పార్టీకి.. తాజాగా మరో పార్టీ తమ మద్దతు ప్రకటించింది. రాష్ట్రంలో ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధికారికంగా ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి పని చేయాలని డీఎంకే సానుభూతిపరులకు సూచించారు. హస్తం పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించేలా పని చేయాలని కోరారు. తమిళనాడు రాష్ట్రంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని సర్కార్ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమిలో డీఎంకే భాగస్వామిగా ఉంది. తమిళనాడులోనూ డీఎంకే, కాంగ్రెస్ పార్టీ మధ్య పొత్తు ఉంది. గత ఎన్నికల సమయంలో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి. ఈ క్రమంలోనే తెలంగాణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీకి మద్దతిస్తున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. సీఎం కేసీఆర్‌కు షాక్..: అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీ కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నట్లు ప్రకటించడంతో కేసీఆర్‌కు షాక్ తగిలినట్లైంది. గతంలో భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఫ్రంట్ ఏర్పాటు విషయంలో పలు రాష్ట్రాల సీఎంలతో కేసీఆర్ భేటీ అయ్యారు. ఆయా జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీల నేతలను కలిశారు. ఈ క్రమంలోనే తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తోనూ సమావేశమై మద్దతు కోరారు. ప్రస్తుతం ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న డీఎంకే నిర్ణయంతో ఆయన కేసీఆర్ వెంట లేనట్లుగా అర్థమవుతోంది. అదే సమయంలో భారత్ రాష్ట్ర సమితి ఇటు ఇండియా కూటమిలో గానీ.. అటు బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమిలో గానీ భాగస్వామిగా లేకపోవడం గమనార్హం.

## లష్కరే తోయిబా ఉగ్రసంస్థపై ఇజ్రాయెల్ నిషేధం



న్యూఢిల్లీ,నవంబర్ 21 (సమ సమాజం): దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో భీకర ఉగ్రదాడి జరిగి 15 ఏళ్లు కావస్తోంది. ఈ నేపథ్యంలో ముంబయి మారణహోమానికి కారణమైన పాకిస్థాన్?కు చెందిన లష్కరే తోయిబాపై నిషేధం విధిస్తున్నట్లు ఇజ్రాయెల్? ప్రకటించింది. ఈ విషయాన్ని దిల్లీలోని ఇజ్రాయెల్? రాయబార కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. లష్కరే తోయిబాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించడానికి అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని ఇజ్రాయెల్? ఎంబసీ తెలిపింది. భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక అభ్యర్థన లేకుండా స్వతంత్రంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. లష్కరే తోయిబాను ఘోరమైన తీవ్రవాద సంస్థగా అభివర్ణించింది. వందలాది మంది భారతీయులతో పాటు ఇతరులను పొట్టనపెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేసింది. శాంతియుత భవిష్యత్తు కోసం భారత్?కు బాసటగా ఉంటామని చెప్పింది. పాకిస్థాన్‌కు చెందిన పదిమంది ఉగ్రవాదులు.. నవంబర్ 26, 2008 సాయంత్రం కొలాబా సముద్రతీరం నుంచి ముంబయికి చేరుకొన్నారు. ఆ తర్వాత బృందాలుగా విడిపోయిన ముష్కరులు అత్యంత రద్దీగా ఉండే ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ రైల్వే స్టేషన్‌లోకి చొరబడ్డారు. వెంటనే వారిచేతుల్లో ఉన్న ఏకే-47 తుపాకులను తీసి తూటాల వర్షం కురిపించారు. అక్కడ కన్పించిన వారినల్లా పిట్టల్లా కాల్చి చంపారు. ఊహించని ఘటనలతో వణికిపోయిన అక్కడి ప్రజలు భయంతో పరుగులు తీశారు. పోలీసులు అక్కడకు చేరుకునేలోపే దాదాపు 58 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన ఉగ్రవాదులు వీధుల్లోకి వచ్చి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఆ తర్వాత వరుసగా కామా హాస్పిటల్, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, నారిమన్ లైట్ హౌస్ ఇలా వరుసగా 12 చోట్ల ఏకధాటిగా కాల్పులు, బాంబుల మోత మోగింది. దాదాపు 60 గంటల పాటు సాగిన ఆ మారణహోమంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 18 మంది భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. మొత్తం ప్రాణాలు కోల్పోయిన వారిలో కేవలం భారతీయులే కాకుండా మరో 14 దేశాలకు చెందిన పౌరులు కూడా ఉన్నారు.

## యుద్ధానికి కాస్త విరామం..

### ఇజ్రాయెల్-హమాస్ మధ్య సయోధ్య!

5రోజుల పాటు యుద్ధానికి బ్రేక్?!



గాజా,నవంబర్ 21 (సమ సమాజం): పశ్చిమాసియాలో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న హమాస్-ఇజ్రాయెల్ మధ్య పోరాటానికి కొన్ని రోజులు విరామం ప్రకటించే అవకాశముంది. ఈ మేరకు ఇరుపక్షాల మధ్య సంధి కుదిరే అవకాశాలు సైతం మెరుగయ్యాయి. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియా ప్రకటన చేశారు. ఐదు రోజుల పాటు ఇజ్రాయెల్-హమాస్ మధ్య పోరుకు బ్రేక్? పడే అవకాశముందని సమాచారం. గాజాలో భీకరంగా పోరాటం జరుగుతున్న వేళ.. ఉగ్రసంస్థ హమాస్ ఓ కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌తో సంధికి చేరువవుతున్నట్లు హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియా ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో పోస్ట్ కూడా చేశారు. హమాస్, ఇజ్రాయెల్ రక్షణదళం-%×ణఖీ%కు మధ్య జరుగుతున్న పోరాటంలో సామాన్య ప్రజలే ఎక్కువగా బలైపోతున్న నేపథ్యంలో ఇరుపక్షాల మధ్య సంధి కుదిర్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖతార్ మధ్యవర్తిత్వంలో ఈజిప్టు, కొన్ని అరబ్ దేశాలు, అమెరికా కొద్దిరోజులుగా సంధి కుదిర్చేందుకు ఇరుపక్షాలతో చర్చలు జరుపుతున్నాయి. అక్టోబర్ 7న హమాస్ ఉగ్రసంస్థ అపహరించిన బందీలను విడుదల చేసే వరకూ దాడులు ఆపబోమని.. ఇజ్రాయెల్ చెబుతోంది. ఈ నేపథ్యంలో సంధి ప్రయత్నాలు తుదిదశకు చేరుకుంటున్నట్లు సోమవారం అమెరికా అధ్యక్షుడు బైడెన్ వెల్లడించారు. తాజాగా హమాస్ సంస్థ అధిపతి ఇస్మాయిల్ హనియా కూడా ఇదే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం 5 రోజుల పాటు సంధికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిసింది. ఈ ఐదు రోజులు క్షేత్రస్థాయిలో కాల్పుల విరమణ, దక్షిణ గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులు తగ్గించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రతిగా 50 నుంచి 100 మంది బందీలను హమాస్ విడుదల చేస్తుంది. విడుదల చేసే బందీల్లో సామాన్య పౌరులు, విదేశీయులు ఉంటారు. బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ సైనికులను విడుదల చేయబోమని హమాస్ చెప్పినట్లు తెలిసింది. ఈ ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న 300 మంది పాలస్తీనా వాసులను విడుదల చేయాలని హమాస్ ప్రతిపాదించినట్లు సమాచారం. 300 మందిలో మహిళలు, పిల్లలు కూడా ఉన్నట్లు తెలిసింది. మరోవైపు గాజాలో బాధితులకు మానవతా సాయం అందించేందుకు అంతర్జాతీయ సంస్థలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. రెడ్ క్రాస్ అంతర్జాతీయ ప్రతినిధి ఖతార్ వెళ్లి ఈ అంశంపై హమాస్ అధినేత హనియాతో చర్చించనున్నారు. బాధితులను రక్షించడమే అన్నిటికంటే అధిక ప్రాధాన్యం కావాలని ఇరుపక్షాలకు రెడ్‌క్రాస్ విజ్ఞప్తి చేసింది.

## ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి జరగలేదు

### మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్

### తెలంగాణలో మాఫియా రాజ్యం: కిషన్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్ 21 (సమ సమాజం): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచార జోరుని బీజేపీ మరింత పెంచింది. ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, నితిన్ గడ్కారీ, నిర్మలా సీతారామన్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు తెలంగాణ ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్నారు. తాజాగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ కూడా ఇక్కడ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ నియోజకవర్గం దోమలగూడలో బీజేపీ అభ్యర్థి పూస రాజు తరపున పార్టీ రాష్ట్రాధ్యక్షుడు కిషన్ రెడ్డితో కలిసి ఫడ్నవీస్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా కేసీఆర్ నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రచారం ఆర్భాటం తప్ప కేసీఆర్ వల్ల తెలంగాణలో ఎలాంటి అభివృద్ధి జరగలేదంటూ బీఆర్ఎస్ సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ప్రజలు గెలిపించాలని కోరారు. తెలంగాణలో మాఫియా రాజ్యం నడుస్తోందన్నారు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు కిషన్‌రెడ్డి. కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఎలాంటి లాభం ఉండదని, తెలంగాణలో మార్పు బీజేపీతోనే సాధ్యం అన్నారు .అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం అని దీమా వ్యక్తం చేశారు.

## 5ఏళ్లలో 10లక్షల ఉద్యోగాలు..

### రాష్ట్రంలో పక్కాగా కులగణన

### రాజస్థాన్ ప్రజలపై కాంగ్రెస్ హామీల వర్షం

రాజస్థాన్ నవంబర్ 21 (సమ సమాజం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజస్థాన్ ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్? పార్టీ కీలక హామీలు కురిపించింది. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కులగణన చేపడతామని హామీ ఇచ్చింది. పంచాయతీ స్థాయిలో నియామకాల కోసం కొత్త వ్యవస్థను తీసుకొస్తామని తెలిపింది. రైతులకు రూ.2లక్షల వరకు వడ్డీ లేని రుణాలు, స్వామినాథన్ కమిషన్ ప్రకారం కనీస మద్దతు ధర ఇస్తామని ప్రకటించింది. ఐదేళ్లలో 10 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, అందులో ప్రభుత్వ రంగంలోనే 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని వెల్లడించింది. జయపురలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, సీనియర్ నేత సచిన్ పైలట్ తదితరులు ఈ మేనిఫెస్టోను విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇప్పటికే పలు గ్యారంటీలను ప్రకటించగా.. తాజాగా కులగణనను అందులో చేర్చింది. ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని మల్లికార్జున ఖర్గే తెలిపారు. రాజస్థాన్? ఆర్థిక వ్యవస్థ.. 15 లక్షల కోట్ల రూపాయలకు చేరుతుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్? గహ్లోత్? తెలిపారు. 2030 కల్లా జీడీపీని 30 లక్షల కోట్ల రూపాయలకు చేరుస్తామని చెప్పారు. ఆర్థిక వ్యవస్థను తాము నిర్వహిస్తున్న తీరును చూసి రాష్ట్ర ప్రజలు గర్విస్తున్నారన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం 46.48 శాతం పెరిగిందని వెల్లడించారు. 200 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న రాజస్థాన్‌లో నవంబరు 25వ తేదీన ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. నవంబరు 23 వరకు ప్రచారానికి గడువు ఉంది. ఈ ఎన్నికల్లో విజయం కోసం కాంగ్రెస్, బీజేపీ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ తమ మేనిఫెస్టోను ప్రకటించింది.

## కేసీఆర్ తలకిందులుగా తపస్సు చేసినా నన్ను ఓడించలేరు

### సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



హైదరాబాద్,నవంబర్ 21 (సమ సమాజం): తెలంగాణలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఎన్నికల వేళ ఒకరిపైఒకరి నేతలు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. అయితే.. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేతే, సీఎం కేసీఆర్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క గెలవరంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కామెంట్లకు భట్టి కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కేసీఆర్ అనే ఓ బండ రాయిని.. రత్నం అనుకుని పదేళ్లు నెత్తిన పెట్టుకున్నారని, ఇప్పుడు తెలంగాణ ప్రజలకు స్పష్టత వచ్చిందన్నారు. రాయేదో రత్నమేదో తెలంగాణ ప్రజలకు తెలుసు అని, మధిర రత్నాన్ని హైదరాబాదులో పెడతారన్నారు. కేసీఆర్ తలకిందులుగా తపస్సు చేసినా నన్ను ఓడించడం లేరని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఇప్పుడే కాదు.. గతంలోనూ నన్ను ఓడించాలని కేసీఆర్ ఇలాగే ప్రయత్నించారు.. కానీ సఫలం కాలేకపోయారని, కాంగ్రెస్ పార్టీకి కేవలం 20 సీట్లే వస్తాయని కేసీఆర్ భావిస్తే.. కాకిలా ఎందుకు తిరుగుతున్నారన్నారు భట్టి విక్రమార్క. అంతేకాకుండా..'నన్ను గెలిపించండి.. నా అభ్యర్థిని గెలిపించండని కేసీఆర్ లెక్కకు మిక్కిలిగా సభలు పెడుతున్నారు. తానే గజ్వేల్లో గెలవలేనని కామారెడ్డి వెళ్లిన కేసీఆర్.. కాంగ్రెస్ ఓడిపోతుందని చెప్పడం హాస్యాస్పదం. తెలంగాణ సీఎం ఎవరో మా అధిష్టానం నిర్ణయిస్తుంది. సీఎంగా ఉండి కేసీఆర్ ఫాం హౌస్ కే పరిమితం అయ్యారు. సీఎల్పీ నేతగా నా నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరిస్తూనే రాష్ట్ర సమస్యల పరిష్కారానికి ప్రయత్నించాను. దళిత బంధు అమలు విషయంలో కేసీఆర్ నన్ను ఆహ్వానించింది నిజం కాదా..? దళిత బంధు అమలు విషయంలో నేను సూచనలు చేసింది నిజం కాదా..? దళిత బంధును కేసీఆర్ ఎస్సీ వర్గం ఓట్ల కోణంలో మాత్రమే చూశారు.' అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్‌ను నమ్మితే ఆగమవ్వుడు ఖాయం

### బీఆర్ఎస్ పాలనలోనే హుస్నాబాద్ అభివృద్ధి

### కేసీఆర్ వచ్చాక ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు

### హుస్నాబాద్ రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు



హుస్నాబాద్, నవంబర్ 21 (సమ సమాజం): ఎన్నికలకు తక్కువ సమయం ఉండడంతో రాష్ట్రంలో ప్రధాన పార్టీలు ప్రచార జోరును పెంచాయి. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకుంటున్నారు. అధికార ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షాలు ఎత్తి చూపుతున్నాయి. 10 ఏళ్ల అభివృద్ధినే అస్త్రంగా చేసుకుని బీఆర్ఎస్ ముమ్మరంగా ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి హరీశ్ రావు ఇవాళ హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో హుస్నాబాద్ అభివృద్ధి చెందలేదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. హుస్నాబాద్‌లో రోడ్ షోలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పాలనలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని తెలిపారు. కోహెడ మండలంలోని అన్ని గ్రామాలకు భవనాలు మంజూరు చేశామని వెల్లడించారు. కేసీఆర్ వచ్చాక ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు వచ్చాయన్న మంత్రి.. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు నిధులు మంజూరు చేశామని పేర్కొన్నారు. కరోనా వచ్చినప్పుడు నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు ఎక్కడికి వెళ్లారంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలను నమ్మితే మోసపోవడం ఖాయమని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హస్తం నాయకులు ప్రకటించిన మేనిఫెస్టో కంటే బీఆర్ఎస్ మేనిఫెస్టో చాలా నయమని చెప్పారు. తమ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం కేవలం 3 గంటలు సరిపోతుందంటున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో చెక్‌డ్యామ్‌లు కట్టుకున్నాం. రైతుబంధు పెట్టి దుబారా ఖర్చు చేస్తున్నారని ఉత్తమ్ అంటున్నారు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధు జీరో అవుతుంది. బీఆర్ఎస్ గెలిస్తేనే రైతుబంధు డబ్బులు వస్తాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వబోతున్నాం. రాష్ట్రంలో కోటి కుటుంబాలకు రూ.5 లక్షల బీమా ఇవ్వబోతున్నాం. బీఆర్ఎస్ గెలిచిన వెంటనే జనవరి నుంచి సన్న బియ్యం ఇస్తామని అన్నారు. కేసీఆర్ అంటే రాష్ట్ర ప్రజలకు నమ్మకమని.. మంత్రి హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్‌దే అని.. గీత, నేత కార్మికులకు పింఛన్ ఇస్తున్నామని చెప్పారు. అధికారం కోసం కాంగ్రెస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌లో మూడు దిక్కులా అభివృద్ధి అవుతుందని.. కోహెడ ప్రతి గల్లీకి సీసీ రోడ్లు వేయించామని .. హుస్నాబాద్‌లో 100 పడకల గది నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ వాళ్లు కరెంటు మీటరు పెట్టి ఇంటికి బిల్లు ఇవ్వమంటున్నారని.. కాంగ్రెస్ నాయకులు మూడు గంటల కరెంటు చాలు అంటున్నారని మండిపడ్డారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU*,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in